ఈనాడు సూర్యాపేట

ఆదివారం సెప్టెంబరు 29, 2024 5

సనాతన ధర్మాలను విస్మరించకండి: పీఠాధిపతి



మట్టపల్లి ఆలయ సందర్శనకు వచ్చిన పీఠాధిపతి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

మఠంపల్లి, న్యూస్‌టుడే: సనాతన ధర్మాలను మానవాళి విస్మరించకూడదని భీమవరం అనంతశ్రీ విభూషిత భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి, పరమ హంస పరివ్రాజ కాచార్య శ్రీరామచంద్ర రామానుజ జీయర్ పేర్కొన్నారు. మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని దర్శించుకునేందుకు శనివారం క్షేత్రానికి వచ్చిన పీఠాధిపతి ఆలయంలో తీర్థజనులను ఉద్దేశించి ప్రసంగించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆధ్యాత్మిక వేత్తలతో పాటు భక్తులపైనా ఉంటుందన్నారు. మానవ సేవే మాధవ సేవని దీన్ని ఆచరించినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని వెల్లడించారు. శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌కు రాజగోపురం వద్ద ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయకుమార్ అర్చకులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల తదుపరి జీయర్‌కు శ్రీస్వామి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికలు

మునగాల, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా అండర్-14 క్రికెట్ పోటీలను ఈనెల 30న తేదీన జిల్లా కేంద్రంలోని కుడకుడ రహదారిలోని ఎస్జీఎం క్రికెట్ అకాడమీలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ అజాంబాబా తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-14 క్రికెట్ పోటీల ఎంపికలను అక్టోబరు 1వ తేదీన ఎస్జీఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్ ధ్రువపత్రంతో హాజరుకావాలని పేర్కొన్నారు.

పోలీస్



అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగ ప్రకటన జారీలో జాప్యం కొనసాగింది. ఇతర శాఖల మాదిరిగా కాకుండా పోలీసు శాఖలో తరచూ నోటిఫికేషన్లు వెలువడేవి. ఉత్తమమైన మార్కులు లేకున్నా సగటు డిగ్రీ విద్యార్థి కూడా మైదానంలో ఒళ్లువంచి కష్టపడితే పోలీసు ఉద్యోగం లభించే పరిస్థితులు ఉండేవి.

సుమారు 15 ఏళ్ల క్రితం జిల్లాలో తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం, పరిశ్రమల స్థాపన కూడా అంతంత మాత్రమే కావడం, జిల్లాలో కొంతమేర వ్యవసాయరంగం సానుకూలంగా ఉండటం, మరికొంత మేర కరవు తాండవించడం, ముఖ్యంగా రైతు కుటుంబాలు ఆర్థికంగా బలంగా లేకపోవడం వంటి సామాజిక స్థితిగతులు జీవితంలో ఏదో ఒక ఉద్యోగాన్ని సాధించాలనుకునే యువతకు పోలీసు ఉద్యోగాలు ఒక మహదవకాశంగా కనిపించాయి.

వామపక్ష రాజకీయాల ప్రభావంతో యువతలో అన్యాయాన్ని ధిక్కరించే ధోరణి అలవడింది. దీంతోపాటు వారిలో సేవా దృక్పథం కూడా ఉండటం కూడా పోలీసు ఉద్యోగాల వైపు వారు దృష్టి సారించే పరిస్థితులు కలిగాయి.

1980ల ప్రారంభం నుంచి సుమారు 2005 వరకు జిల్లాలో వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు అధికంగా ఉండేవి. జిల్లాలో నిరుద్యోగ యువత అటువైపు ఆకర్షితులు కాకుండా పోలీసు ఉద్యోగాల వైపు యువతను ఆకర్షించడానికి ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు వెలువరించేది. ఉద్యోగార్థుల్లోని ఔత్సాహికులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కూడా ఇచ్చేవారు. ఇష్టంతో పోలీసు శాఖలోకి వెళ్లిన వారు తమ కుటుంబాలకు దన్నుగా నిలిచారు.

జీవితంలో త్వరగా స్థిరపడాలని..



డిగ్రీ పూర్తి చేయగానే కుటుంబ పరిస్థితుల రీత్యా ఏదో ఒక ఉద్యోగం సాధించి, కుటుంబానికి అండగా నిలబడటంతో పాటు జీవితంలో త్వరగా స్థిరపడాలనే ఆలోచనతోనే తాను పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకున్నానని చెపుతున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకికి చెందిన **షేక్ జహంగీర్.** ఆయన ప్రస్తుతం దక్షిణ మండల అదనపు డీసీపీ, హైదరాబాద్ సిటీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1990లో కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణలో ఉండగానే ఎస్సై పోస్టుకు పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. 2007లో సీఐగా, 2017లో డీఎస్పీగా, 2023లో అదనపు డీసీపీగా పదోన్నతి పొందారు. ఆవేశంతో పాటు ఆలోచనపరులుగా ఉండే జిల్లా వాసుల్లో సామాజిక స్పృహ సహజంగానే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అవసరం..అభిమానం..



తన కుటుంబ పరిస్థితులతో పాటు ఆ శాఖపై ఉన్న అభిమానం తనను పోలీసు ఉద్యోగం వైపు మళ్లించాయని తెలిపారు నల్గొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన **జాల మల్లేశ్.** ఆయన ప్రస్తుతం రాష్ట్ర ఆక్టోపస్ విభాగంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పేద కుటుంబం కావడంతో ఎస్టీడీ బూత్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ డిగ్రీ పూర్తి చేశారాయన. చిన్నప్పటి నుంచి ఏదైనా సాధించాలని, అది నలుగురిలో ఒకరిగా కాకుండా ప్రత్యేకంగా ఉండాలని కోరుకునే వాడినని మల్లేశ్ పేర్కొన్నారు. 2007లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై, 2009లో రిజర్వ్ ఎస్సైగా ఎంపికై ఆక్టోపస్‌కు వెళ్లానని, 2017లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి (హైదరాబాద్) లభించిందన్నారు.



\- చిట్యాల, న్యూస్‌టుడే

త్వరలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు: కలెక్టర్


సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

స్పందనకు వందనం

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కేంద్రంలో త్వరలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్) ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. 'ఈనాడు'లో శుక్రవారం 'నడిపించే వారు లేక.. నరకయాతన' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపీ రిజిస్టర్, ఏఎంసీ వార్డు, టీహబ్‌తోపాటు సీడీఎస్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. రక్త పరీక్షలు, రేడియాలజీ, అల్ట్రా స్కాన్ రోజుకు ఎన్ని చేస్తున్నారన్న వివరాలను టీహబ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సదరం ధ్రువపత్రాల జారీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ అంశంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విచారణకు ఆదేశించారు.

డబ్బు ప్రమేయం లేని రాజకీయాలే లక్ష్యం: కోదండరాం

మహాత్మాగాంధీ రోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: డబ్బుల ప్రమేయం లేని రాజకీయాలే తమ లక్ష్యమని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు కోదండరాం అన్నారు. సూర్యాపేటలో శనివారం నిర్వహించిన పార్టీ ప్లీనరీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకులు పదేళ్ల కాలంలో తెలంగాణ ఆశయాలను అణగదొక్కారని, అమరుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రశ్నించిన గొంతుకలను తొక్కిపట్టారని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో అధికారం చేపట్టిన భారాస ఏమాత్రం వారిని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి నేడు పనికి రాకుండా చేసిందన్నారు. వారు చేసిన అప్పులకు నేడు కాంగ్రెస్ సర్కారు రూ.5వేల కోట్ల వడ్డీలు చెల్లించాల్సి వస్తోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గట్ల రమాశంకర్, కుంట్ల ధర్మార్జున్, మొగంపల్లి ఆశప్ప, సర్దార్ వినాయక్ కుమార్, నారబోయిన కిరణ్ కుమార్, బొడ్డు శంకర్, బచ్చలకూరి గోపి, వీరేష్ నాయక్ పాల్గొన్నారు.


సూర్యాపేటలో తెజస ప్లీనరీలో మాట్లాడుతున్న అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు కోదండరాం

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

◆ 2,980 కేసుల పరిష్కారం

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. అత్యధికంగా 2,980 కేసులు పరిష్కరించారు. కక్షిదారుల సౌకర్యార్థం నాలుగు వేర్వేరు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. 2,531 పెండింగ్ కేసులు, 449 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన బెంచ్‌లో 57 మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లు పరిష్కారం కాగా బాధితులకు రూ.3.17 కోట్ల పరిహారంగా చెల్లించారు. ప్రిలిటిగేషన్ కేసుల పరిష్కారం ద్వారా బ్యాంకులతోపాటు వివిధ ప్రభుత్వ సంస్థలకు రూ.13.6 లక్షల ఆదాయం లభించింది. సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జిలు కె.సురేష్, జె.ప్రశాంతిలు నేతృత్వం వహించిన బెంచ్‌లలో సైతం పెద్ద సంఖ్యలో కేసులను రాజీ కుదిర్చారు. లోక్ అదాలత్ సభ్యులుగా పి.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, జె.వెంకటేశ్వర్లు, పి.కృష్ణ, ఆర్.ఉప్పలయ్య, కె.రంజిత్ కుమార్, ఆర్.శంకరయ్య, ఆర్.యాదగిరి వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నూకల సుదర్శన్‌రెడ్డి, డి.మల్లయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.లింగయ్య, కాకి రాంరెడ్డి, నాతి సవీందర్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఒకే కేసులో రూ.62లక్షల పరిహారం.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పేరం దేవయ్య శ్యాంసన్(56) కుటుంబానికి రూ.62 లక్షలు పరిహారం చెల్లించేందుకు శ్రీరాం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అంగీకరించింది. ఈ మేరకు మృతుని కుటుంబ సభ్యులకు అవార్డు ప్రతిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో అందించారు.


లోక్ అదాలత్‌లో బాధిత కుటుంబానికి అవార్డు ప్రతిని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

తులం బంగారం ఎప్పుడిస్తారు..?: మాజీ మంత్రి

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలనలో హామీలన్నీ పగటి కలగానే మిగిలిపోతున్నాయని, ఆడబిడ్డల ఆశలు నెరవేరేదెప్పుడో తెలియని పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 372 మంది లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కలెక్టరేట్‌లో శనివారం పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలయినా కేసీఆర్ మంజూరు చేసిన కల్యాణలక్ష్మి కింద రూ.లక్షే అందుతోందని, తులం బంగారం ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు. భారాస పదేళ్ల పాలనలో ఆడబిడ్డలకు ఎక్కువ పథకాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్నీ అదనంగా ఇస్తామని నమ్మించి, మోసం చేశారన్నారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ఆర్డీవో వేణుమాధవ్, చివ్వెంల తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.


సూర్యాపేటలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

పేదల ఇళ్లు కూల్చివేస్తే ఊరుకోం

భానుపురి: హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తే ఊరుకునేది లేదని, వారికి అండగా ఉండి పోరాటం చేస్తామని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని 42, 43వ వార్డుల్లో శనివారం పర్యటించి బాధితులతో మాట్లాడారు. ప్రస్తుతం పేదలు ఉంటున్న ఇళ్లన్నీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినవేనని, అదే ప్రభుత్వం మళ్లీ ఇళ్లను కూలగొడుతోందన్నారు. త్వరలోనే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు అన్యాయం జరగకుండా చూస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, భారాస నాయకులు జీడి భిక్షం, గండూరి ప్రకాశ్, సంజీవ్‌నాయక్, అంగిరేకుల నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేటలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ - 2 ఐజీ సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నరేశ్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు వచ్చిన ఆరోపణ నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చేపట్టామని, పూర్తి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సారస్వత పరిషత్తు సాహితీ పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో విశిష్ట ప్రక్రియల్లో విశేష కృషి చేసిన ఏనిమిది మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు ప్రకటించింది. ఎర్రోజు రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్మహే బహూకరించనున్నారు. ఆచార్య పాకాల యశోదారెడ్డి అవార్డును డాక్టర్ భాస్కరయోగి, డాక్టర్ బిజవాడ గోపాలరెడ్డి సాహిత్య పురస్కారాన్ని మోత్కూరి నరహరి, డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని ఆచార్య ఎన్ భక్తవత్సలరెడ్డికి, ఆలూరి బైరాగి కవితా పురస్కారాన్ని నాగరాజు బాలరామ్, డా.వానమామలై వరదాచార్యుల పురస్కారాన్ని డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, ఆచార్య రావికంటి వసునందన్ సాహితీ పురస్కారాన్ని రేడియం (జి.కొండప్ప)కు, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని పురస్కారాన్ని డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యకు అందజేయనున్నారు. వచ్చే నెల 4న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ బొగ్గులకుంటలోని పరిషత్ ప్రాంగణంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చే మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.



RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందడోలికల్లో తేలుస్తున్నాయి. లైవ్ షోలు మరపురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్లో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణలతో పండగల వేళ చిన్నా పెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

నాటి విద్యార్థి.. నేడు ప్రధానోపాధ్యాయుడు



సుంకోజు భాస్కర్

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల గ్రామం మల్లేపల్లికి చెందిన సుంకోజు భాస్కర్ తాను విద్యనభ్యసించిన చోటే ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. తదుపరి హైదరాబాద్‌లో ఉన్నత చదువులు బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా (ఎస్‌ఏ, సైన్స్)ఎంపికయ్యారు. రాజపేట మండలం రఘునాథపురం, యాదగిరిగుట్ట, ఆత్మకూర్, చందుపట్లలో పని చేశారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో భాగంగా వలిగొండ శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ప్రస్తుతం వలిగొండ మండల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణంగా ఇలాంటి అవకాశం కొందరికి మాత్రమే లభిస్తుంది.

◆ నాటి ఉపాధ్యాయులు పటిష్ఠమైన ప్రాథమిక, హైస్కూల్ విద్య అందించడంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, తాను చదివిన పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నందుకు సంతోషంగా, గర్వంగా ఉందని చెబుతున్నారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో రాబోయే రోజుల్లో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో పాటు పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రణాళికబద్ధంగా వ్యవహరించి మండలంలో సర్కార్ బడుల బలోపేతం చేసి జిల్లాలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ఎస్.భాస్కర్ తెలిపారు. – న్యూస్‌టుడే, వలిగొండ



కేఎల్‌ఎన్ బాలుర కళాశాలలో రాంనగర్ బన్నీ సినిమా హీరో చంద్రహాస్, హీరోయిన్ విస్మయశ్రీ. చిత్ర బృందం

రాంనగర్ బన్నీ సందడి

వచ్చే నెల 4న విడుదల కానున్న 'రాంనగర్ బన్నీ' సినిమా బృందం శనివారం మిర్యాలగూడ పట్టణంలో సందడి చేసింది. కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరో చంద్రహాస్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచా జోషి, చిత్ర యూనిట్ పాల్గొన్నారు. చిత్రంలోని పలు సన్నివేశాల గురించి విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ మహాత్, నిర్మాత మలయజ ప్రభాకర్, అంబికా వాణి, కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ

చిక్కింది.. బంగారు చేప

శాలిగౌరారం ప్రాజెక్టులో గాలంతో చేపలను పట్టేందుకు వెళ్లిన ఓ బాలుడికి బంగారు వర్ణం కలిగిన చేప చిక్కింది. ఏ చెరువులోనైనా పాంప్లేట్ చేప నల్ల వర్ణంలో ఉంటుంది. కానీ దానికి భిన్నంగా బంగారు వర్ణంలో ఉండడం అరుదని మత్స్యకారులు చెబుతున్నారు.



న్యూస్‌టుడే, శాలిగౌరారం

ప్రాణం పెట్టి.. పాఠం చెప్పేటోళ్లకు వందనం: డా.అందెశ్రీ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: నెలవారీ జీతాల కోసం కాకుండా, బడుగు జీవుల భవిష్యత్తు కోసం ప్రాణం పెట్టి పాఠం చెప్పే ఉపాధ్యాయులందరికీ దండం పెడతానని లోక కవి డా.అందెశ్రీ అన్నారు. విశిష్ట మహిళ, కీర్తి రత్న, ఉత్తమ పాఠ్య పుస్తక రచయిత డా. బండారు సుజాత శేఖర్ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా శనివారం హాజరై మాట్లాడారు. అక్షరాన్ని ఎవరు మడి కట్టుకుంటారో, తలపై ఇరుముడి కట్టుకుంటారో వాళ్లకు శరణాగతి చెప్తానన్నారు. ప్రభుత్వ బడుల్లోకి వచ్చేది పిల్లలు కాదని, దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్లని తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కూరెళ్ల విఠలాచార్య సరస్వతి మాత చిత్రపటానికి పుష్పార్చన చేసి జ్యోతిని వెలిగించారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి, ఉద్యోగ విరమణ అనంతరం సమాజానికి సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో, రచయిత్రిగా బహుముఖ సేవలందించిన సుజాత అభినందనీయురాలని మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ స్కూల్ కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్ అధ్యక్షత వహించారు. ఎస్సీఈఆర్టీ విశ్రాంత డైరెక్టర్ డా.కలపాల ఆనందకిశోర్, రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, 'ఐప్సో' రాష్ట్ర కన్వీనర్ కేవీఎల్, ప్రభాకర్, దేవేందర్, అయోధ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, మాధవరెడ్డి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో డా.సుజాతశేఖర్ పదవీ విరమణ సన్మాన సభలో జ్యోతి వెలిగిస్తున్న లోక కవి అందెశ్రీ, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కూరెళ్ల విఠలాచార్య, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ఎస్సీఈఆర్టీ విశ్రాంత డైరెక్టర్ డా.కలపాల ఆనందకిశోర్ తదితరులు

యువకుడి దారుణ హత్య

డిండి, న్యూస్‌టుడే: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన డిండి మండలం చెర్కుపల్లి గేటు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(34)ని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చేతులు, కాళ్లను తాడుతో కట్టేసి.. నోరు, కళ్లను చున్నీతో చుట్టారు. అనంతరం బండరాళ్లతో తలపై కొట్టి హత్యచేసి చెర్కుపల్లిగేటు సమీపంలో చెట్ల పొదల్లో పడేశారు. సమీపంలోని రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా.. డీఎస్పీ గిరిబాబు, డిండి, చందంపేట, నేరెడుగొమ్ము ఎస్సైలు రాజు, సతీష్, సతీష్‌లు చేరుకొని ఘటనా స్థలిని పరిశీలించారు. హత్య చేసిన వ్యక్తులను గుర్తించేందుకు లభ్యమైన ఖాళీ బీరు సీసాలపై వేలి ముద్రలు సేకరించనున్నట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. డిండి, దేవరకొండ ప్రధాన రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



డిండి: ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గిరిబాబు

ఎంజీయూ పీజీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పీజీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాల్లో 72శాతం ఉత్తీర్ణత, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో 56.27 శాతం, రెండో సెమిస్టర్‌లో 63.75 శాతం, మొదటి సెమిస్టర్‌లో 38.5శాతం ఉత్తీర్ణత సాధించారు. పూర్తి వివరాలను ఎంజీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఎంజీయూ ఓఎస్డీ కె.అంజిరెడ్డి, సీవోఈ ఉపేందర్ రెడ్డి, సంధ్యారాణి, భిక్షమయ్య, పాల్గొన్నారు.



ఎంజీయూ పీజీ ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ అల్వాల రవి, తదితరులు

◆ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ కంట్రోలర్‌గా రామచందర్‌గౌడ్, కో- ఆర్డినేటర్‌గా డా. భిక్షమయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఆదేశాలు జారీ చేశారు.

వీర విజయం..!

◆ వయసు గడువుకు నెల ముందు దరఖాస్తు.. 48 ఏళ్లకు కొలువు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబం.. ఆపై అడుగడుగునా అపజయాలతో నిరుత్సాహం.. అయినా పట్టువదలని ధీరత్వం.. చదువు పూర్తయిన 17 ఏళ్లకు.. అదీ ఉద్యోగ వయసు గడువుకు కేవలం నెల ముందు దరఖాస్తు చేసి.. 48 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించి యువతకు సవాల్ విసిరి.. అన్ని వర్గాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు మిర్యాలగూడ మోటారు వాహనాల తనిఖీ అధికారి లాల్‌కోట వీరస్వామి. ఆయన 'న్యూస్‌టుడే'తో తన జీవిత విశేషాలు వివరించారు.



లాల్‌కోట వీరస్వామి

వేసవి సెలవుల్లో కోళ్ల ఫారంలో..

మాది నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం కుర్మిద్ద. అమ్మానాన్న లాల్‌కోట కృష్ణయ్యగౌడ్, దేవమ్మ వ్యవసాయ కూలీలు. అమ్మ పాచి పని కూడా చేసేది. ప్రాథమిక విద్య గ్రామంలో, ఏడు, ఎనిమిది తరగతులు పక్క గ్రామంలో పూర్తి చేశాను. ఉన్నత విద్య కోసం ప్రభుత్వ వసతిగృహంలో చేరగా.. అక్కడి నాణ్యత లేని ఆహారం, వాతావరణంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఇక్కడ ఉండగానే వేసవి సెలవుల్లో కోళ్ల ఫారంలో కార్మికుడిగా పనికి వెళ్లేవాడిని. ఇంటర్ పూర్తయిన తర్వాత ఇక చదివించే స్థోమత లేకపోవడంతో. . అమ్మ ప్రోత్సాహంతో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి.. ప్రభుత్వ కళాశాలలో ఆటోమొబైల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఈ సమయంలో సెలవు రోజుల్లో హాస్టల్ లేక తిండి కోసం అనేక అవస్థలు పడ్డాను.

గల్ఫ్‌కి పయనం..

డిప్లొమా అనంతరం వివాహం.. కుటుంబ పోషణ కోసం చిన్న ఉద్యోగంలో చేరా. అనంతరం మిత్రుల సూచనతో దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఏజెన్సీ మోసంతో అత్తింటి వారు ఇచ్చిన డబ్బు పోగొట్టుకున్నా. మరోసారి ప్రయత్నించి.. సౌదీఅరేబియాకు వెళ్లా. ఆటోమొబైల్ రంగంలో కాకుండా బోర్‌వెల్ రంగంలో పని చేయాల్సి రావడంతో నిరుత్సాహానికి గురయ్యా. దీంతో మూడేళ్ల తర్వాత తిరిగి దేశానికి వచ్చి.. హైదరాబాద్‌లో మకాం పెట్టి.. ఓ కార్ల షోరూంలో సర్వీస్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించా. జీతం సరిపోకపోవడంతో మిత్రులతో కలిసి కార్ల మెకానిక్ షాప్ ప్రారంభించా.

❖ అది బాగానే ఉన్నా.. 2004లో ఏఎంవీఐ ఉద్యోగాల నోటిఫికేషన్ రావడంతో చదువు పూర్తయిన 17 ఏళ్లకు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేశా. ఇంటర్వ్యూతో పోయింది. 2009లో మళ్లీ దరఖాస్తు చేశా. అప్పటికి నా వయసు ప్రభుత్వం ఇచ్చిన కటాఫ్‌కు ఒక నెల మాత్రమే తక్కువ. పలుమార్లు వైద్య పరీక్షలు.. 2012లో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎట్టకేలకు 48 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించా. మా బ్యాచ్‌లో నేనే ఎక్కువ వయసు వాడిని కాగా.. అతి తక్కువ వయసు నాలో సగం 24 ఏళ్ల వారూ ఉన్నారు.

❖ 'జీవితంలో ఎన్ని కష్టాలు, అవరోధాలు ఎదురైనా ప్రయత్నించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహానికి గురికావొద్దు. విజయం ఎప్పటికైనా సిద్ధిస్తుందనడానికి నా జీవితమే ఉదాహరణ'..అని ఆయన స్పష్టం చేశారు.

పల్లెవెలుగులో.. ప్రసవం

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ఓ గర్భిణి ప్రసవించిన ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడువాయి స్టేజి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండకు చెందిన శివవాసి అలివేలు.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వైద్యపరీక్షల నిమిత్తం వెళ్లి, స్వగ్రామానికి కోదాడ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తుండగా.. మార్గమధ్యలో తాడువాయి స్టేజి వద్దకు బస్సు చేరుకోగానే నొప్పులు వచ్చాయి. ఇది గుర్తించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును పక్కన నిలిపారు. సాధారణ ప్రసవం కావడంతో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. బస్సులో ఉన్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు ప్రథమ చికిత్సను నిర్వహించి తల్లి బిడ్డను జిల్లా జనరల్ వైద్యశాలకు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ, అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.



తల్లీ బిడ్డలను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

సంతలో చోరీ చేసిన రూ.10.50 లక్షలు స్వాధీనం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట పశువుల సంతలో ఈ నెల 16న ఓ డీసీఎం వాహనం నుంచి రూ.10.50 లక్షలు చోరీ చేసిన ఇద్దరు నిందితులతోపాటు డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ఠాణాలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన



సూర్యాపేటలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

తాజుద్దీన్ అనే వ్యాపారి పశువుల కొనుగోలుకు తన వెంట తెచ్చుకున్న డబ్బును డీసీఎంలో ఉంచి జీవాల బేరం మాట్లాడేందుకు వెళ్లారు. తిరిగొచ్చి చూస్తే డబ్బు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారని భావించి బాధితుడు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వాహన డ్రైవర్లు కోదాడకు చెందిన జావిద్, హయత్ అలీ ఆ డబ్బు దొంగిలించినట్లు గుర్తించారు. నిందితులిద్దరినీ శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై కుశలవ, క్రైం సిబ్బంది కరుణాకర్, కృష్ణ, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించండి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పిల్లలకు సరైన పౌష్టికాహారం అందిస్తేనే రేపటి సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఎస్సై ముత్తయ్య అన్నారు. చాలా మంది తల్లులకు అవగాహన లేక పిల్లల పౌష్టికాహారంపై దృష్టి సారించలేక పోతున్నారని తెలిపారు. శనివారం వర్తక సంఘ భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోషణ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. సీడీపీవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లల, తల్లుల, గర్భిణులకు పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిత్యం అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు త్రివేణి, విజయ, సతీష్, గంగరాజు, భాస్కర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

మునగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సనేలా హెల్త్ సహకారంతో శంకర కంటి వైద్యశాల వారిచే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్త గంధం సైదులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త బస్టాండ్, బాలాజీ సూపర్ మార్కెట్, చంద్రం హోటల్ బజార్ ప్రాంతాల్లో లైన్ మరమ్మతులకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణంలో రహదారి వెడల్పులో భాగంగా జాన్‌పహాడ్ రోడ్డులో 11 కేవీ విద్యుత్తు స్తంభం మార్పులు ఉన్నందున టౌన్-1 ఫీడర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెరగాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెరగాలని హరిత విప్లవ కమిటీ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి, సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ శంకరయ్యలు అన్నారు. స్థానిక తేజ విద్యాలయలో హరిత విప్లవంపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల నుంచి భూమి నాయకులు(ఎర్త్ లీడర్)గా 6 నుంచి పదో తరగతికి ఇద్దరు చొప్పున 10 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగా తేజ విద్యాలయలో 10 మందిని ఎంపిక చేశారు. దసరా అనంతరం పర్యావరణ అంశాలపై రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఎర్త్ సెంటర్‌లో రెండు రోజుల శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు నగేష్, అనుదీప్, పాఠశాల డైరక్టర్ సోమిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో హరిత విప్లవ కమిటీ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి

కేసులు రాజీ చేసి.. న్యాయవాదులను అభినందించి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ మెగా లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసి, అత్యధిక కేసులు రాజీ అయ్యేలా కృషి చేసిన న్యాయవాదులను అభినందించి, కక్షిదారులకు పులిహోర వడ్డింపులతో మెగా లోక్‌అదాలత్ ఉత్సాహంగా సాగింది. కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ రాజీకి వచ్చిన కేసులను పరిష్కరించి తీర్పులు చెప్పారు. గత నాలుగు దఫాలుగా జిల్లాలోనే అత్యధిక కేసులు రాజీ చేసిన ఘనతను ఈసారి కూడా హుజూర్‌నగర్ దక్కించుకున్నట్లు న్యాయమూర్తులు ప్రకటించారు.

చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలు: న్యాయవాదులు చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాల వల్ల విజయవంతం అయిందని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ అన్నారు. తమ కేసులను వదులుకుని ఆదాయాన్ని త్యాగం చేసిన తీరు గొప్పగా ఉందని న్యాయవాదులను అభినందించారు. కక్షిదారులు కూడా తమ సమయాన్ని, డబ్బును ఆదా చేసుకున్న వారు అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో 900 క్రిమినల్ కేసులు, 18 సివిల్ కేసులు, 295 మోటారు వాహన చట్ట నిబంధనల ఉల్లంఘన కేసులలో కక్షిదారులు రాజీ పడ్డారు. న్యాయమూర్తులు ఆయా కేసులను కొట్టివేశారు. వివిధ కేసులలో కక్షిదారులు జరిమానాల రూపంలో చెల్లించిన రూ. 18,85,950 చెల్లించిన పైకాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని న్యాయమూర్తులు ఆదేశాలు ఇచ్చారు. మధ్యాహ్న సమయంలో కక్షిదారులకు న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ పులిహోరను పంపిణీ చేశారు.


హుజూర్‌నగర్ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, వేదికపై జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్

హాస్యనటుడు వేణుమాధవ్ జయంతి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడలోని తెర సాంస్కృతిక కళా మండలి ఆధ్వర్యంలో సినీ హాస్య నటుడు, కోదాడ నివాసి వేణుమాధవ్ జయంతిని శనివారం నిర్వహించారు. కళామండలి గౌరవ సలహాదారు పారా సీతయ్య, అల్లం ప్రభాకర్‌రెడ్డిలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెంకటేశ్వర్లు, మదీనా మీరా, శ్రీనివాసరావు, రంగారావు, వీరారెడ్డి, సైదానాయక్, నరేష్, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.


వేణుమాధవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అల్లం ప్రభాకర్‌రెడ్డి, పారా సీతయ్య, తదితరులు

మహాసభలను జయప్రదం చేయండి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. నేడు, రేపు సూర్యాపేటలో ఐదో జిల్లా మహాసభలు జరుగుతాయని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యక్షుడు కిషోర్‌బాబు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ రవీందర్‌లతో కలిసి మహాసభల గోడపత్రికను స్థానిక పాఠశాలల్లో పంపిణీ చేశారు. వీరస్వామి, వెంకటేశ్వర్లు, నాగేందర్, సాయిలు, ధనలక్ష్మి, బుచ్చిరెడ్డి, శోభన, సునీల పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల


మునగాల: తుది ఓటరు జాబితాను విడుదల చేసిన ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్

మునగాల: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఓటర్ల తుది ఓటరు జాబితాను శనివారం ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ విడుదల చేసి, నోటీసు బోర్డులో ప్రదర్శించారు.

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల ఓటర్ల తుది జాబితాను శనివారం ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో హరిసింగ్ పాల్గొన్నారు.

నడిగూడెం: గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలను శనివారం ఎంపీడీవో సయ్యద్ ఇమామ్ నోటీసు బోర్డులో ఉంచారు.

పాలకవీడు గ్రామీణం: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసి వార్డుల వారీగా తుది జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీవో లక్ష్మి తెలిపారు.

మేళ్లచెరువు: మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో ఓటరు తుది జాబితాను శనివారం ప్రదర్శించారు. మేళ్లచెరువు మండలంలో మొత్తం 33,991 మంది, చింతలపాలెం మండలంలో మొత్తం 26,480 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

శుద్ధజలాల్లో అవసరమైన పోషకాలు

మోతె, న్యూస్‌టుడే: ఆర్వో ప్లాంటు ద్వారా వచ్చిన నీళ్లకంటే.. ప్రభుత్వం సరఫరా చేస్తున్న శుద్ధజలాల ప్లాంట్ల ద్వారా వచ్చే నీరు తాగితే మానవాళి ఆరోగ్యకరంగా ఉంటుందని ప్రత్యేకాధికారి సీతారాములు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పాండు అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో గ్రామ మంచినీటి సహాయకులకు మూడోరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శుద్ధజలాల్లో మనుషులకు అవసరమైన మినరల్స్, ఇతర పోషకాలు ఉంటాయన్నారు. అదే ఆర్వో నీటిలో ఇవేవీ ఉండకుండా తొలగించడంతో క్యాల్షియం తదితర లోపాలు తలెత్తి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా నీటి నాణ్యతను పరిశీలించే విధానాన్ని వారికి వివరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు, ఏఈలు మణికంఠ, రుత్విక్ పాల్గొన్నారు.


మోతె: శుద్ధజలాల నాణ్యతను ప్రయోగాత్మకంగా గ్రామ నీటి సహాయకులకు వివరిస్తున్న శిక్షకులు

కబడ్డీ విజేతలకు బహుమతుల పంపిణీ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని పెంచికల్‌దిన్నలో రెండురోజుల పాటు జరిగిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు శనివారం ఎంఈవో సత్యనారాయణరెడ్డి బహుమతులు అందజేశారు. అండర్-14 బాలికల కబడ్డీలో మేళ్లచెరువు మండల జట్టు ప్రథమ స్థానం, నేరేడుచర్ల మండల జట్టు ద్వితీయ స్థానం పొందాయి. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. పాఠశాల హెచ్.ఎం శ్రీనివాసరావు, నేరేడుచర్ల హెచ్.ఎం మధు, ట్రస్టు ఛైర్మన్ లచ్చయ్య పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: సీపీఎం

మునగాల, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలు గెలుపే లక్ష్యంగా ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. నర్సింహులగూడెంలో శనివారం నిర్వహించిన పార్టీ గ్రామ మహాసభకు హాజరై మాట్లాడారు. గ్రామకమిటీ కార్యదర్శిగా జూలకంటి కొండారెడ్డి, శాఖ కార్యదర్శులుగా వెంకటరెడ్డి, సీతారాములు, స్వరూప, శేఖర్లను ఎన్నుకున్నారు. వెంకటేశ్వరావు, రమేష్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి డిమాండ్ చేశారు. కట్టవారిగూడెంలో మాట్లాడారు. మండల కార్యదర్శి యాకూబ్ పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు భగత్‌సింగ్

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు భగత్‌సింగ్ అని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. నేరేడుచర్ల ప్రధాన కూడలి వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వెంకట్, జానయ్య, శ్రీను, శాంతయ్య, జాని, వెంకటాచారి పాల్గొన్నారు.


నేరేడుచర్ల: పూలే, భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య, తదితరులు

నేరేడుచర్ల: నేరేడుచర్లలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శనివారం జ్యోతిరావ్ పూలే, భగత్‌సింగ్ చిత్రపటానికి ఆ పార్టీ డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక చరిత్రపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సలీం షరీఫ్ అన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో కోదాడ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్.డి.సాధిక్ చిత్రలేఖనంలో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించడంతో కలెక్టర్, డీఈవోల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదేనని జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, పెన్షనర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్యలు అన్నారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో శనివారం నిర్వహించిన సామూహిక జన్మదిన వేడుకల్లో వారు మాట్లాడారు. వృద్ధులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి రాంబాబు, ఉపాధ్యాయులు నర్సయ్య, రఘువర ప్రసాద్, అమృతా రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మునగాల: వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులుకు ఈ మేరకు శనివారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు.


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య, తదితరులు

విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: సెప్టెంబరు నెలలో పుట్టిన విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను.. ఆ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 13 మంది ఈనెలలో పుట్టినవారు ఉండగా అందులో హాజరైన ఏడుగురితో సంఘ నాయకులు కేకు కోయించి, మిఠాయిలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు చెన్నా సోమయ్య, ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, దేవదానం, మొయినొద్దీన్, ఎంఎస్ఎన్‌రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


జన్మదిన వేడుకల సందర్భంగా సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు, ఆ సంఘ నాయకులు

ఇరు కుటుంబాల ఘర్షణ.. కేసు నమోదు

మఠంపల్లి, న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో ఇరు కుటుంబాలు పరస్పర దాడులకు పాల్పడిన ఘటన మఠంపల్లిలో శుక్రవారం చోటు చేసుకోగా శనివారం కేసు నమోదైంది. ఈ దాడులలో రెండు కుటుంబాలకు చెందిన పలువురి తలలకు గాయాలై హుజూర్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పాత బస్టాండ్ సమీపంలో పక్కపక్కనే ఉంటున్న తాటికొండ పాపిరెడ్డి, తోడేటి వెంకయ్య కుటుంబాల మధ్య కొంతకాలంగా స్థల వివాదంపై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తన ఇంటి పునాదుల్లోకి నీటిని వదులుతున్నారని పాపిరెడ్డి కుటుంబ సభ్యులు వెంకయ్య భార్య వెంకట నరసమ్మను ఘటన జరిగిన రోజు నిలదీశారు. తోపులాట జరగడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె బంధువులు రాత్రి సమయంలో పాపిరెడ్డి సహా ఏడుగురిపై విచక్షణారహితంగా కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఇరు కుటుంబాల యజమానులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు.. దాడులకు పాల్పడిన రెండు కుటుంబాలకు చెందిన వారితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీయండి

కోదాడ పట్టణం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికితీయాలని ఎంఈవో సలీం షరీఫ్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వర్క్ ఎడ్యుకేషన్ కార్యశాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్క్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్కండేయ, వీరబ్రహ్మాచారి పాల్గొన్నారు.

శ్రమదానం నిర్వహించి.. ప్రజలకు వివరించి

మునగాల, న్యూస్‌టుడే: ప్రజలు ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల అభివృద్ధి అధికారి రమేష్ దీన్‌దయాల్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మునగాల, బరాత్‌కత్‌గూడెం గ్రామపంచాయతీల్లో శ్రమదానం నిర్వహించి, చెత్త బుట్టల వినియోగాన్ని ప్రజలకు వివరించారు.

హుజూర్‌నగర్: స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. వార్డుల్లో శ్రమదానం చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకుబ్ పాషా, సతీష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


మునగాల: చెత్త బుట్టల వినియోగాన్ని వివరిస్తున్న ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్

న్యాయమూర్తుల శ్రమదానం.. కోదాడ: కోర్టు ఆవరణంలో శనివారం కోదాడ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య శ్రమదానంలో పాల్గొని, పరిసర ప్రాంతాలు శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పుర కమిషనర్ రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగగా, జడ్జిలు, న్యాయవాదులు కలిసి శ్రమదానం చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి.. గరిడేపల్లి: ప్రకృతి వ్యవసాయంపై ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేవీకే ఇన్‌ఛార్జీ డి.నరేష్ సూచించారు. ఐదురోజుల పాటు ఈ శిక్షణ ఇస్తున్నామని ఆసక్తిగల రైతులు మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేల కిరణ్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ కొత్త పింఛన్లు ఇవ్వాలి.. నడిగూడెం: అర్హులందరికీ కొత్త పింఛన్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వేణుగోపాలపురంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాయకులు శ్రీనివాస్, సంజీవరావు, పిచ్చయ్య, శ్రీకాంత్, వీరయ్య గోపి పాల్గొన్నారు.

ఎన్నిక.. మోతె: మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన టీపీటీయూ సంఘం సర్వసభ్య సమావేశంలో మండల కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి శంకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగెం వీరన్న, ప్రధానకార్యదర్శిగా వీరబాబు, మహిళా కార్యదర్శిగా అనురాధను ఎన్నుకున్నారు.

కోదాడ పట్టణం: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పట్టణశాఖ నూతన కమిటీని శనివారం ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎన్నికల పరిశీలకులు నాగేశ్వరరావులు తెలిపారు. అధ్యక్షుడిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పాండురంగాచారి, ప్రధాన కార్యదర్శిగా సైదిరెడ్డి (ఎంపీపీ ఎస్ హరిజనవాడ, కోదాడ), ఉపాధ్యక్షుడిగా సైదులు, మహిళా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, కోశాధికారిగా సత్యనారాయణ ఎన్నికైనట్లు తెలిపారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:
విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** సత్యం సుందరం

సంక్షిప్త సమాచారం

సంతాపం.. నడిగూడెం: సీపీఎం సీనియర్ నాయకుడు గీత కార్మిక సంఘం నేత రామాపురం గ్రామానికి చెందిన కాసాని హనుమయ్య(70) శనివారం మృతి చెందారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, వీరయ్య, మధు, ఉపేందర్, భార్గవ్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని క్యాంపు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పబ్లిక్ హెల్త్ నర్స్ దామెర్ల అనంత లక్ష్మీ ఆమె పుట్టిన రోజు సందర్భంగా భర్త అనిల్‌కుమార్ జ్ఞాపకార్థం 30 మంది విద్యార్థులకు రూ.20 వేల విలువ గల క్రీడా దుస్తులను, రూ.ఐదు వేలతో కళావేదికకు బ్యాక్ గ్రౌండ్ కర్టన్, జీప్సీ అనాథ ఆశ్రమ పిల్లలకు రూ.10 వేల విలువ గల ప్లేట్లు, గ్లాసులను శనివారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి.. హుజూర్‌నగర్ గ్రామీణం: దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని శనివారం పీఏసీఎస్ ఛైర్మన్ జక్కుల నరేందర్ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్ధవార్షిక సమావేశంలో మాట్లాడారు.

కమిటీ ఎన్నిక.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని దద్దనాల చెరువు కాలనీలో బేతేల్ గాస్పల్ చర్చిలో శనివారం జిల్లా పాస్టర్ల కమిటీ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శామ్యూల్ గుండు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యోహోషా, ఉపాధ్యక్షుడిగా దాసుబాబు ఎన్నుకున్నారు.

జాషువా జయంతి.. నేరేడుచర్ల: జాతీయ ఉత్తమ రచయిత అవార్డు గ్రహీత గుర్రం జాషువా జయంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. శేఖర్‌రావు, ధనుంజయనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఉద్యమిద్దాం.. కోదాడ: ప్రతి ఒక్కరూ కుల రహిత సమాజానికి ఉద్యమించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 151వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సైదులు, ప్రతాప్ పాల్గొన్నారు.

అధికారుల విచారణ.. కొక్కిరేణి (మునగాల): కొక్కిరేణి పీఏసీఎస్‌లో జిల్లా సహకార కార్యాలయ సీనియర్ ఇన్‌స్పెక్టర్స్ మంజుల, షేక్ బడేసాబ్‌లు.. గ్రామ రైతులు నందిగామ సైదులు, రేఖ రజిత, ఎల్లావుల వీరయ్య చేసిన ఫిర్యాదులపై శనివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులు వీరయ్య, రజిత పంట రుణాలు డబుల్ ఎంట్రీ వల్ల వారికి రుణమాఫీ కాలేదని, మరో రైతు సైదులు పంట రుణం మాఫీ కాగా, ఎల్‌టీలోను ఓడీ ఉండటంతో అందులో జమ చేశారని డీసీవోకి ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయిలో విచారణ చేసినట్లు తెలిపారు. నివేదికను అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

వాసవీ వనితాక్లబ్ విత్తన బంతుల తయారీ.. నేరేడుచర్ల: పర్యావరణ పరిరక్షణకు స్థానిక వాసవీవనితా క్లబ్ విత్తన బంతులు తయారీ చేపట్టింది. శనివారం బాల్స్ తయారీని వాసవీక్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, జోన్ ఛైర్మన్ శ్రీలత పరిశీలించారు. వనితాక్లబ్ మహిళలు చింత, సపోటా, కుంకుడు గింజలు వంటి వాటితో బాల్స్ తయారు చేస్తున్నారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, వనితాక్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆలాప్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం విత్తనాల బంతులు పంపిణీ చేశారు. వాటి ప్రాధాన్యతను వివరించి పెద్దలతో వాటిని నాటించాలని చెప్పారు. బాల్స్‌లలో నిమ్మ, బత్తాయి, మునగ, యాప విత్తనాలను సరఫరా చేసినట్లు తెలిపారు.


విత్తన బంతులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్లలో సాయిబాబా జన్మదినం సందర్భంగా ఆలయంలో శనివారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర గులాబీ అర్చన, హారతి, సాయి నామస్మరణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రాచకొండ రామకోటేశ్వరరావు తగు ఏర్పాట్లు చేయించారు. దాతలు అంజయ్య, వెంకటేశ్వర్లు అన్నదానం జరిపారు.


మధ్యాహ్న హారతి ఇస్తున్న అర్చకుడు

అయ్యప్పస్వామి ఆలయంలో..

నేరేడుచర్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆలయం ప్రారంభించి 41 రోజులైనా సందర్భంగా శనివారం వేదపండితులు ఇరువంటి వెంకటరమణ శర్మ, సత్యనారాయణశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాల అనంతరం పూల మాలలతో ప్రత్యేక అలంకరణ జరిపారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, పుర ఛైర్మన్ ప్రకాశ్, వైస్ ఛైర్‌పర్సన్ సరిత, చిన్నవెంకటరెడ్డి, నాగయ్య, ఎస్సై రవీందర్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సహస్రనామ ఫలపుష్పార్చన..

హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డలో వేంచేసి ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాలస్వామి ఆలయంలో బహుళ ఏకాదశి సందర్భంగా స్వామికి సహస్రనామ ఫలపుష్పార్చన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వేపల సింగారం గ్రామానికి చెందిన గుమ్మేత గోవింద రెడ్డి, శ్రీలక్ష్మీ, జస్వంత్‌రెడ్డి, జయంత్‌రెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

ప్రతి తరగతి గదికో ఉపాధ్యాయుడు అవసరం

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: జీవో నెంబరు 25ను సవరించాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి జాక్టో రాష్ట్ర అధ్యక్షుడు పట్టిపాక రాధాకృష్ణ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం కుక్కడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కాకుండా ప్రధానోపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, కల్లూరి నాగయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, యల్లాగౌడ్ పాల్గొన్నారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఎన్టీఆర్‌నగర్, తాళ్లగడ్డలో ఇళ్ల పక్కనే ఉన్న మురుగు కాల్వలపై స్లాబ్ లేకపోవడంతో చిన్నారులు అందులో పడే అవకాశం ఉంది. –నర్సయ్య, సూర్యాపేట

✔ పరిశీలించి ఏర్పాటు చేయిస్తాం. –సురేశ్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని నల్లాలబావి రోడ్డు రాఘవ ప్లాజా వద్ద తాగునీటి పైపులైన్ గేట్‌వాల్వ్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథా అవుతోంది. –సురేశ్, సూర్యాపేట

✔ వెంటనే మరమ్మతు చేయిస్తాం. –శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఎస్ఎఫ్ఐ నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

మహాత్మాగాంధీ రోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో శాంతియుతంగా విద్యార్థి మహాగర్జన సభ నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం సూర్యాపేటలో ఆ సంఘ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలపక్ష విజయ్, సుమన్, శ్రీను, రవి, మహేష్, గోపి, శివ, విగ్నేష్, నాగేష్ పాల్గొన్నారు.

జీజేఎల్ఏ నూతన కార్యవర్గం

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: జీజేఎల్ఏ జిల్లా కమిటీ ఎన్నికలు శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వీడీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కర్నాటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మద్దిమడుగు సైదులు, సహాయ కార్యదర్శిగా రేపాక గురువయ్య, కోశాధికారిగా శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా ప్రణితిరెడ్డి ఎన్నికయ్యారు.

సర్దుబాటు జీవోను సవరించాలని వినతి

సూర్యాపేట కలెక్టరేట్: బదిలీలు, పదోన్నతుల్లో అన్యాయం జరిగిన వారి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని యూఎస్‌పీసీ నాయకులు రేపాక లింగయ్య, యాకయ్య పేర్కొన్నారు. యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జీవో నెంబర్ 25ను గతంలో ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించగా నిలుపుదల చేసినట్లు, ప్రస్తుతం సర్దుబాటు పేరుతో అదే జీవోను అమలు చేయడం సమంజసం కాదని తెలిపారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్.వెంకటేశ్వర్లు, సుభాని, జి.వెంకటేశ్వర్లు, శంకర్, జ్ఞాన సుందర్, సైదానాయక్, కృష్ణమూర్తి, నాగన్న, యాదగిరి పాల్గొన్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపులు

శంకుస్థాపనకే పరిమితమైన తిరుమలనగర్ రోడ్డు



సూర్యాపేట పట్టణంలోని తిరుమలనగర్ రహదారి దుస్థితి

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో ప్రధాన రహదారులకు మోక్షం కలగడం లేదు. కాలనీలపై దృష్టి పెట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది జనం తిరిగే తిరుమలనగర్ రోడ్డును విస్మరిస్తున్నారు. 2017లో అప్పటి ప్రజాప్రతినిధులు నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి పనులు మాత్రం మొదలు కాలేదు.



శంకుస్థాపన శిలాఫలకం

దగ్గరి దారిలో రాకపోకల రద్దీ

తిరుమలగర్ రోడ్డు నుంచి ఖమ్మం రోడ్డుకు ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తారు. శ్రీరాంనగర్, బాలాజీనగర్, టీచర్స్ కాలనీవాసులు జాతీయ రహదారి నుంచి వెళ్లకుండా ఇక్కడి నుంచి సులువుగా వెళ్లవచ్చని ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. ఖమ్మం దారి నుంచి వచ్చే వాహనదారులు, ప్రయాణికులు ఈ రోడ్డు మీదుగా కుడకుడ రోడ్డుకు నేరుగా ప్రయాణించవచ్చు. జాతీయ రహదారి నుంచి కొత్తబస్టాండ్ మీదుగా తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు. కుడకుడ, ఖమ్మం రోడ్డు వైపు నుంచి వచ్చేవారు కలెక్టరేట్‌కు తిరుమలనగర్ దారి మీదుగానే వెళ్లే అవకాశం ఉంది. జాతీయ రహదారి నుంచి తిరిగి రావాల్సిన పని ఉండదు. ఇలా వివిధ రహదారుల నుంచి సూర్యాపేటకు వచ్చే ప్రజలు ఉపయోగిస్తున్న రహదారిని సీసీగా మార్చాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే వారు కరవు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వానొస్తే చిత్తడిగా మారుతోంది

–శ్రీనివాస్, తిరుమలనగర్

తిరుమలనగర్ రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. ఏళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా స్పందించలేదు. వర్షాలు కురవని సమయంలో వాహనాల రాకపోకలకు దుమ్ము పైకి లేచి ఇళ్లపై పడుతోంది. ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. ఇప్పటికైనా సీసీగా మార్చాలి.

నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

తిరుమలనగర్ రహదారి నిర్మాణ విషయమై ఉన్నతాధికారులకు వివరిస్తాం. వారి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే సీసీ రహదారి నిర్మిస్తాం. వాహనదారులు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సులు: కలెక్టర్



సూర్యాపేట: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహిళా సంఘం సభ్యులతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

భానుపురి, న్యూస్‌టుడే: జిల్లాలో మహిళా సంఘాల బలోపేతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. సూర్యాపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన భానుపురి జిల్లా సమాఖ్య సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. జిల్లాలో 579 గ్రామ సంఘాల్లో 1,82,074 మంది సభ్యులు ఉన్నారని, వీరంతా పటిష్ఠ పుస్తక నిర్వహణ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మగువల ఆర్థిక ప్రగతికి, వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడానికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సంఘం మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, గ్రామాల్లో ఆరోగ్య అవగాహన కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం అతివలతో స్వచ్ఛత ఈ సేవ, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వి.వి.అప్పారావు, డిప్యూటీ సీఈవో శిరీష, అడిషనల్ డీఆర్డీవో సురేష్, జిల్లా సమైక్య కార్యదర్శి రమణ, కోశాధికారి కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

భానుపురి జంతు ప్రేమికులు పెంచుకొనే జీవాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ దినం సందర్భంగా శనివారం సూర్యాపేటలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రేబిస్ టీకాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. పెంపుడు జంతువులకు ఆరునెలలకోసారి టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు జానయ్య, గోపి, కిరణ్, కృష్ణ, కౌన్సిలర్ అనంతుల యాదగిరి పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

నూతనకల్: మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను నూతనకల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 166 వార్డులుండగా 28,439 ఓటర్లు ఉన్నారు. వీరిలో 14,216 మంది పురుషులు, 14,223 మంది మహిళలు ఉన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాను విడుదల చేసి చదివి ప్రజలకు వినిపించారు. ఎంపీవో శశికళ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గిలకత్తుల సుధాకర్, రాగి చలమయ్య, తాళ్లపల్లి వెంకన్న, గడ్డమీది శ్రీనాథ్, బోయిళ్ల వెంకన్న, బాణాల మధుసూదన్‌రెడ్డి, ఆకుల ఉమేష్, సత్యవతి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: వివిధ కారణల వల్ల కేసుల పాలై కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గమని తుంగతుర్తి సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఫర్హీన్ కౌసర్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజలు పంతాలకు పోయి వైరుధ్యాలను పెంచుకోవద్దన్నారు.



తుంగతుర్తిలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి ఫర్హీన్ కౌసర్

కక్షిదారులు లోక్ అదాలత్‌లో ఇరువర్గాల వారు రాజీకి వచ్చి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీను రఘువీర్‌రెడ్డి, ఎస్సై ఏడుకొండలు సూపరింటెండెంట్ అంజయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, లోక్‌అదాలత్ సభ్యులు సతీష్, అనిల్‌కుమార్ యాదవ్, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, నాగరాజు, రాజారాం పాల్గొన్నారు.

వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లిలోని నాగారం కస్తూర్బా విద్యాలయంలో శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు షీటీమ్స్, సైబర్ నేరాలు, మత్తు మందులపై పోలీస్ కళాబృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. అర్వపల్లి ఎస్సై బాలకృష్ణ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాట్సప్, ఫేస్‌బుక్‌లో వ్యక్తిగత ఫొటోను డీపీగా పెట్టుకోవద్దని సూచించారు. షీ టీమ్స్ ఎస్సై నీలిమా, విద్యాలయం ఎస్‌వో శిరీన్, హెడ్‌కానిస్టేబుల్ యల్లారెడ్డి పాల్గొన్నారు.

మద్దిరాల: సమాజంలో పెరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రధానోపాధ్యాయిని శకుంతల తెలిపారు. శనివారం మండలంలోని పోలుమళ్లలో మద్దిరాల పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి, ప్రమాదంలో ఉంటే 100కు డయల్ చేయాలని, అపరిచితుల నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లను క్లిక్ చేయవద్దని హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య సూచించారు. ఉపాధ్యాయులు మహేశ్వరం వెంకటయ్య, పోలీసు సిబ్బంది మీరా, వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం కృషి చేస్తుందని పీఏసీఎస్ ఛైర్మన్ పాలెపు చంద్రశేఖర్ అన్నారు. శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహా జనభ నిర్వహించారు. రైతులకు ఇప్పటి వరకు అందించిన రుణాలు, సంఘం నిర్వహణ ఖర్చుల వివరాలు సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.విజయ్‌కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు ఎల్.రంజానాయక్, బి.కిష్టు, జి.అశోకరెడ్డి, సత్తయ్య, వజ్జె శంకరయ్య, స్వర్ణలత పాల్గొన్నారు.

భూ తగాదాలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మద్దిరాల, న్యూస్‌టుడే: భూ తగాదాలు పరిష్కారం కావడం లేదని మనస్తాపానికి గురైన రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి యత్నించిన ఘటన మండలంలోని కుక్కడం ఆవాసం రాజగానితండాలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లకావత్ శ్రీను, లకావత్ రెడ్యా, లకావత్ రవి మధ్య గత కొంతకాలంగా భూ వివాదాలు జరుగుతున్నాయి. ఈ వివాదంపై పలుమార్లు తండాలో పంచాయతీలు నిర్వహించారు. కేసులు నమోదైనా సమస్య పరిష్కారం కావడం లేదని మనస్తాపం చెందిన లకావత్ శ్రీను తన వ్యవసాయ క్షేత్రంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్థులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం

రాయపర్తి(వరంగల్), న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి బస్సు అద్దాన్ని ధ్వంసం చేశాడు. చోదకుడు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సూర్యాపేట డిపోకు చెందిన బస్సు హనుమకొండకు వస్తున్న క్రమంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు బస్టాండ్‌లో ఓ వ్యక్తి కదులుతున్న బస్సెక్కాడు. అనంతరం ఎందుకు బస్సు ఆపడం లేదంటూ చోదకుడితో ఘర్షణ పడి.. దిగి వెళ్లిపోయాడు. ఆ బస్సు రాయపర్తికి చేరుకోగానే మరో బస్సులో వచ్చిన అదే వ్యక్తి రాయితో చోదకుడిని కొట్టేందుకు యత్నించగా.. అద్దానికి తాకింది. అద్దం ధ్వంసం కాగా ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3188	1566
జైశ్రీరాం	3351	1766
ఐఆర్-64	1976	1512
హెచ్ఎంటీ	3019	1919
కందులు	9248	6005
పెసర	7511	2966



విద్యా సామర్థ్యాలు పెంపొందించడమే ఉపాధ్యాయుల లక్ష్యం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: జాతి నిర్మాతలైన ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని విద్యాశాఖ జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ డి.జనార్దన్ కోరారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన 25 మందికి నెమ్మికల్‌లోని వందన గార్డెన్స్‌లో శనివారం సన్మాన కార్యక్రం నిర్వహించారు. మండల విద్యాధికారి పి.ధారాసింగ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ గురువులు మురళీకృష్ణ, రమణ, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, కరుణ, వెంకన్న, విజయ్‌కుమార్, గీత, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సర్దార్‌సింగ్, ధనమూర్తి, జగన్, రేణుక, సరస్వతి, సరిత, ఉపేందర్, రజిత, మాధవరెడ్డి, హైమ, ప్రియదర్శిని, వెంక్యా, స్నేహలత, పి.ఉపేందర్, శ్రీనును శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఇంటిలిజెంట్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



నెమ్మికల్‌లో సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

వీధికుక్కల దాడిలో ఆరు గొర్రెపిల్లల మృత్యువాత

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని ఏనుబాములలో శనివారం వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన తగుళ్ల జనార్దన్ అనే వ్యక్తి తన ఆరు గొర్రె పిల్లలను ఇంట్లోనే ఉంచి గొర్రెలను మేతకోసం అడవికి తోలారు. వీధి కుక్కలు ఇంట్లోకి ప్రవేశించి పిల్లలను కొరికి చంపేశాయి.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించండి



తిరుమలగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి జవాబు పత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్ అన్నారు. శనివారం నూతనకల్‌లోని మండల విద్యా వనరుల కేంద్రంలో 'జాలీ ఫొనిక్స్ ఇంగ్లిష్' శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదుపై ప్రశస్సు యాప్‌పై అర్వపల్లిలోని ఎమ్మార్సీలో శనివారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో బాలునాయక్, ఆర్పీ నాగరాజు పాల్గొన్నారు.

డ్రామా ఫెస్టివల్‌లో పెదనెమిల విద్యార్థుల ప్రతిభ



సూర్యాపేటలో విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి దేవరాజు

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీల్లో నూతనకల్ మండలం పెదనెమిల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో రాములు నాయక్ తెలిపారు. 'వృక్షో రక్షతి రక్షితః' అనే అంశంపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శన జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందినట్లు ఆయన చెప్పారు. అక్టోబరు 17న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు శివయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక డంప్‌లపై విచారణ

తిరుమలగిరి: తిరుమలగిరి పురపాలిక పరిధిలో రెండు ఇసుక డంప్‌లను అక్రమంగా నిల్వ చేసినట్లు లిఖితపూర్వక ఫిర్యాదు రావడంతో మైనింగ్‌శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బి.వసుమతి శనివారం విచారణ చేపట్టారు. అనంతారం, తిరుమలగిరిలోని వెంచర్‌లో ఇసుక డంప్‌లను పరిశీలించారు. వాటికి బిల్లులు లేనట్లయితే జరిమానా విధిస్తామని చెప్పారు.



తిరుమలగిరిలో వివరాలు తెలుసుకుంటున్న మైనింగ్ శాఖ అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే సామేల్

నూతనకల్, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. తహసీల్ కార్యాలయంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 62 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శనివారం చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నూతనకల్ మండలంలో ఇంటర్ కళాశాల, గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నూతనకల్ పీఏసీఎస్ ఛైర్మన్ నాగం జయసుధ, నూతనకల్, మద్దిరాల తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, అమీన్‌సింగ్, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు. నూతనకల్-దంతాలపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించాలని, గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తొన్నుకూరి సైదులుగౌడ్, తీగల గిరిధర్‌రెడ్డి, బూరెడ్డి సంజీవరెడ్డి, చురకంటి చంద్రారెడ్డి పాల్గొన్నారు.



నూతనకల్ తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి గ్రామీణం: యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. వెలుగుపల్లి అవాసం మల్లన్న గుట్ట వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. సుంకరి జనార్దన్, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, సోమయ్య పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: మండలంలోని చౌళ్లతండా ఆవాస రాజ్‌నాయక్ తండాలో విద్యుత్తు నియంత్రికను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఆయన వెంట డీఈ శ్రీనివాస్, ఏడీ శ్రీనివాస్ ఉన్నారు.

బస్సులో మరచిపోయిన హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: సూర్యాపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శనివారం ఉదయం మహబూబాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో పురుషోత్తాయిగూడెంలో ప్రయాణికురాలు గుగులోతు గీత తన హ్యాండ్‌బ్యాగ్‌ను బస్సులోనే మరచిపోయి దిగారు. కండక్టర్ శివరాత్రి భవాని గమనించి డిపో మేనేజర్ సురేందర్‌కు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు అసిస్టెంట్ మేనేజర్ సైదులు హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, రూ.20 వేల విలువైన చరవాణి, రూ.4,200 నగదు ఉన్నట్లు గుర్తించారు. ప్రయాణికురాలు గుగులోతు గీత మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వాసిగా గుర్తించి చరవాణి ద్వారా సమాచారం అందించారు. సూర్యాపేటకు వచ్చిన ఆమె భర్త జగన్‌కు హ్యాండ్‌బ్యాగ్ అందించారు. బాధ్యతగా, నిజాయతీగా విధులు నిర్వర్తించిన కండక్టర్ శివరాత్రి భవానిని డిపో మేనేజర్ అభినందించారు.



సూర్యాపేట ఆర్టీసీ డిపోలో హాండ్‌బ్యాగ్ అందజేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ సైదులు, సిబ్బంది

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

సూర్యాపేట పట్టణం: దళిత, గిరిజన అండతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్టీ, ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్ కోరారు. శనివారం సూర్యాపేటలో ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో బోయిల అఖిల్, దాసరి దేవయ్య, ఏడిండ్ల అశోక్, ముక్కంటి, వెంకట నర్సయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

చివ్వెంల, న్యూస్‌టుడే: సత్యశోధక్ సమాజ్ ఉద్యమ స్ఫూర్తితో కుల నిర్మూలన ఉద్యమాలను కొనసాగిద్దామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సత్యశోధక్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుడకుడ లెనిన్‌నగర్‌లో శనివారం మాట్లాడారు. 152 ఏళ్ల క్రితం మహాత్మా జ్యోతిబా ఫులే సత్యశోధక్ సమాజ్ స్థాపించారన్నారు. కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, నాగయ్య, నర్సయ్య, చంద్రకళ పాల్గొన్నారు.



